# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 16-01-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ భారతదేశం నేడు ప్రపంచంలోనే 3వ అతిపెద్ద స్టార్టప్ పర్యావరణ వ్యవస్థ అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.

- ❖ భారత్, జపాన్ దేశాలు తమ సంబంధాలను వ్యూహాత్మక భాగస్వామ్యంగా మార్చుకున్నాయని విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ అన్నారు.

- ❖ రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించేలా ప్రభుత్వం విత్తన చట్టం-2026ను తీసుకురానుందని కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు.

- ❖ దేశంలోని 80 శాతం అంకుర సంస్థలు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ నేతృత్వంలో ఉన్నాయని కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ చెప్పారు.

= = = = = = = = = = = = = = = = = = = =

స్టార్టప్ ఇండియా కార్యక్రమం ఒక పథకం మాత్రమే కాదని.. విభిన్న రంగాలను కొత్త అవకాశాలతో అనుసంధానించే "రెయిన్‌బో విజన్" అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. జాతీయ స్టార్టప్ దినోత్సవం సందర్భంగా న్యూఢిల్లీలోని భారత్ మండపంలో ఈరోజు జరిగిన స్టార్టప్ ఇండియా దశాబ్ద కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రధానమంత్రి ప్రసంగించారు. 10 సంవత్సరాల స్వల్ప వ్యవధిలో స్టార్టప్ ఇండియా మిషన్ ఒక విప్లవంగా మారిందన్నారు. భారతదేశం నేడు ప్రపంచంలోనే 3వ అతిపెద్ద స్టార్టప్ పర్యావరణ వ్యవస్థ అని పేర్కొన్నారు. నిజమైన సమస్యలను పరిష్కరించడంపై భారతదేశ యువత దృష్టి సారించిందని చెబుతూ... యువ ఆవిష్కర్తలందరినీ ప్రశంసించారు. జాతీయ స్టార్టప్ దినోత్సవం రోజున జరుగుతున్న ఈ సమావేశం త్వరితగతిన అభివృద్ధి చెందుతున్న భారతదేశ భవిష్యత్‌ను ప్రతిబింబిస్తుందని ప్రధానమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

కేంద్ర వాణిజ్యం, పరిశ్రమల శాఖా మంత్రి పీయూష్ గోయల్ మాట్లాడుతూ... గత దశాబ్ద కాలంలో ప్రధానమంత్రి నాయకత్వంలో స్టార్టప్ ల ద్వారా పర్యావరణ వ్యవస్థలో పెద్ద మార్పు జరిగిందని అన్నారు. 2016వ సంవత్సరంలో 400 స్టార్టప్‌లు మాత్రమే ఉండేవని.. ప్రస్తుతం ఆ సంఖ్య 2 లక్షలకు పైగానే ఉందని వివరించారు.

= = = = = = = = = = = = = = = = = = = =

గత రెండు దశాబ్దాలుగా భారత్, జపాన్ దేశాలు తమ సంబంధాలను సమగ్రమైన, వ్యూహాత్మక భాగస్వామ్యంగా మార్చుకోవడంలో విజయవంతమయ్యాయని విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ అన్నారు. జపాన్ విదేశాంగ మంత్రి తోషిమిట్సు మోటేగితో న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన చర్చల ప్రారంభ సమావేశంలో కేంద్రమంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. భారతదేశ మహాసాగర్ చొరవ, జపాన్ దేశ ఇండో-పసిఫిక్ దృక్పథానికి దగ్గరగా ఉందని పేర్కొన్నారు. కీలకమైన ఖనిజాలు, ఇంధనం, ఆరోగ్యం, సముద్ర భద్రత మొదలైన రంగాలలో సహకారంతో సహా వివిధ ద్వైపాక్షిక అంశాలపై చర్చించేందుకు ఇరు దేశాలు ఎదురుచూస్తున్నాయని కేంద్రమంత్రి తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = =

రాబోయే పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో ప్రభుత్వం విత్తన చట్టం-2026ను తీసుకురానుందని కేంద్ర వ్యవసాయం, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు. నాణ్యత లేని, నకిలీ విత్తనాల అమ్మకాలను ఈ చట్టం ద్వారా అరికట్టడం లక్ష్యంగా పెట్టుకున్నట్టు ఆయన ఈరోజు న్యూఢిల్లీలో మీడియాకు తెలియజేశారు. రైతులకు అధిక నాణ్యత కలిగిన, ధృవీకరించబడిన విత్తనాలను అందజేయడం, నాణ్యత లేని ఇన్‌పుట్‌లకు వ్యతిరేకంగా చేపట్టే చర్యల అమలును బలోపేతం చేయడం లక్ష్యంగా ఈ చట్టం పని చేస్తుందన్నారు. ఈ కొత్త చట్టం ద్వారా రైతులు.. విత్తనాలు ఎక్కడి నుండి వచ్చాయో, ఎవరు సరఫరా చేశారో తెలుసుకోవచ్చని కేంద్రమంత్రి తెలియజేస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = =

దేశంలోని 80 శాతం అంకుర సంస్థలు కృత్రిమ మేధ (ఏఐ) నేతృత్వంలో ఉన్నాయని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ అన్నారు. కేంద్రీకృత విధానం, నిధుల మద్దతు ద్వారా భారతదేశ డీప్-టెక్ స్టార్టప్ పర్యావరణ వ్యవస్థ విస్తరిస్తోందని ఒక సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు. ఇండియా సెమీకండక్టర్ మిషన్ కింద డిజైన్ లింక్డ్ ఇన్సెంటివ్ పథకం... ఇప్పటి వరకు 23 స్టార్టప్‌లకు మద్దతు ఇచ్చిందన్నారు. సెమికాన్ ఇండియా-2025లో సంస్థాగత నిధుల కోసం ఒక బిలియన్ డాలర్ల ఇండియా డీప్ టెక్ అలయన్స్‌ను ప్రకటించిందని చెప్పారు. లక్ష కోట్ల రూపాయల కార్పస్ ఫండ్ పరిశోధన, అభివృద్ధి, ఆవిష్కరణ సామర్థ్యాలను బలోపేతం చేస్తోందని అశ్విని వైష్ణవ్ వివరించారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = =

ఉప రాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ న్యూఢిల్లీలోని పార్లమెంట్ హౌస్‌లో యుకె హౌస్ ఆఫ్ లార్డ్స్ స్పీకర్.. లార్డ్ మెక్‌ఫాల్ ఆఫ్ ఆల్‌క్లూయిత్ ను కలిశారు. భారత్‌లో జరుగుతున్న కామన్వెల్త్ స్పీకర్లు, ప్రిసైడింగ్ అధికారుల 28వ సమావేశం (CSPOC) సందర్భంగా ఈ సమావేశం జరిగింది. లార్డ్ మెక్‌ఫాల్ ఆఫ్ ఆల్‌క్లూయిత్ పర్యటన భారత్, యునైటెడ్ కింగ్‌డమ్ దేశాల మధ్య బలమైన పార్లమెంటరీ సంబంధాలను ప్రతిబింబిస్తుందని ఉపరాష్ట్రపతి అన్నారు. చట్ట పాలన పట్ల నిబద్ధత, పార్లమెంటరీ ప్రత్యేక హక్కు, కార్యనిర్వాహక వ్యవస్థ యొక్క ప్రభావవంతమైన పర్యవేక్షణతో సహా ఇరు దేశాల ఉమ్మడి ప్రజాస్వామ్య విలువలను సీ పీ రాధాకృష్ణన్ ప్రస్తావించారు. బాధ్యతాయుతమైన వాక్ స్వాతంత్ర్య గురించి మాట్లాడిన ఉప రాష్ట్రపతి.. శాసనసభలలో దానిని దుర్వినియోగం చేయరాదని వ్యాఖ్యానించారు.

= = = = = = = = = = = = = = = = = = = =

మకర సంక్రాంతి రైతుల పండుగ అని, ఒక విధంగా వారు తమ నూతన సంవత్సరాన్ని ఈ రోజు నుంచే ప్రారంభిస్తారని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన 3వ అంతర్జాతీయ గాలిపటాల ఉత్సవం- 2026ను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ... భారత ప్రజలు పండుగలను ఇష్టపడతారని, ప్రతి సీజన్‌లోను దేశ ప్రజలు పండుగలను నిర్వహిస్తారని చెప్పారు. పండుగల సందర్భంలో మొత్తం సమాజం కలిసి వచ్చి సమిష్టి దృక్పథంతో ముందుకు సాగుతుందని, ఉత్తరాయణం ఆ సంప్రదాయంలో ఒక భాగమని పేర్కొన్నారు. సోమనాథ్ ఆలయం సనాతన ధర్మానికి, అమరత్వానికి చిహ్నమని వ్యాఖ్యానించారు. మకర సంక్రాంతి, పొంగల్, లోహ్రి, మాఘు బిహు సందర్భంగా దేశ ప్రజలకు, రైతులకు అమిత్ షా శుభాకాంక్షలు తెలియజేస్తూ...

(వాయిస్ 26 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రేపు పశ్చిమ బెంగాల్‌లో పలు కొత్త రైళ్ళను ప్రారంభించనున్నారు. హౌరా-గువహతి (కామాఖ్య) - హౌరా వందేభారత్ స్లీపర్, న్యూ జల్‌పైగురి - నాగర్‌కోయిల్ అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్, న్యూ జల్‌పైగురి-తిరుచిరాపల్లి అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్, అలీపుర్‌దువార్-ఎస్ఎమ్‌బిటి బెంగళూరు అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్, అలీపుర్‌దువార్-ముంబై (పన్వేల్) అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను ప్రధానమంత్రి ప్రారంభించనున్నారు. అలాగే.. రాధికాపూర్-ఎస్ఎమ్‌బిటి బెంగళూరు మెయిల్ ఎక్స్‌ప్రెస్ ను, బాలూర్‌ఘాట్-ఎస్ఎమ్‌బిటి బెంగళూరు మెయిల్ ఎక్స్‌ప్రెస్‌లను కూడా నరేంద్ర మోదీ ప్రారంభిస్తారు. మరోపక్క ప్రధానమంత్రి ఆదివారం నాడు.. హౌరా-ఆనంద్ విహార్ టెర్మినల్ అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్, సీల్దా-వారణాసి అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్, సంత్రగాచి-తాంబరం అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్‌లను ప్రారంభించనున్నారని రైల్వే వర్గాలు వెల్లడించాయి.

= = = = = = = = = = = = = = = = = = = =

దేశంలో స్థాపిత విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 2014లో 249 గిగావాట్లుగా ఉండగా.. 2025 నాటికి 510 గిగావాట్లకు పెరిగిందని కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ అన్నారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన భారత్ విద్యుత్ సమ్మిట్-2026 ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడుతూ... విశ్వసనీయత, ప్రాప్యత, స్థితిస్థాపకత ద్వారా ఇంధన సమృద్ధి కలిగిన కొత్త యుగంలోకి భారత్ ప్రవేశించిందన్నారు. భారత్ ఇప్పుడు ప్రపంచంలో 3వ అతిపెద్ద విద్యుత్ ఉత్పత్తిదారు, వినియోగదారు అని పేర్కొన్నారు. దేశంలో శిలాజేతర ఇంధన సామర్థ్యం 2014లో 32 శాతం నుండి 2025లో 52 శాతానికి పెరిగి, ఇంధన పరివర్తనలో భారత్‌ను ప్రపంచ స్థాయిలో నిలిపిందని కేంద్రమంత్రి వివరించారు.

= = = = = = = = = = = = = = = = = = = =

సరైన లైసెన్సులు లేని వాకీటాకీలను విక్రయిస్తున్న పలు ఈ-కామర్స్ ప్లాట్ ఫామ్‌లపై సెంట్రల్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ అథారిటీ (CCPA) చర్యలు చేపట్టింది. నిబంధనలను పాటించని 16 వేల 900 కంటే పైగా వాకీటాకీలను వివిధ ఈ కామర్స్ ప్లాట్‌ఫాంలపై గుర్తించినట్టు CCPA తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = =